సాక్షి నిర్మల్

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



ఎన్నికల 'ఉపాధి'

IIలో▸

ఎన్నికల వేళ వివిధ వ్యాపారాలు పుంజుకుంటు న్నాయి. ఫ్లెక్సీ, పోస్టర్, కరపత్రాల ప్రింటింగ్, సౌండ్‌సిస్టం, లైటింగ్, ప్రచార వాహనాలు తదితర వ్యాపారాలకు డిమాండ్ ఏర్పడింది.

బీఆర్ఎస్‌కు 'వడ్డి' రాజీనామా



నిర్మల్: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు వడ్డి (ధని) రాజేందర్‌రెడ్డి ఆ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. ఆదివారం పార్టీకి రాజీనామా ప్రకటించారు. బీఆర్ఎస్‌లో ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. ధని గ్రామ సర్పంచ్‌గా అప్పట్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆయన త్వరలో బీజేపీలో చేరనున్నట్లు తెలిసింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 / 19.0

ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలి ప్రభావం పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అమ్మవారిని దర్శించుకున్న జిల్లా సెషన్స్ జడ్జి



అమ్మవారిని దర్శించుకుంటున్న సాయిరమాదేవి

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం జిల్లా సెషన్స్ జడ్జి సాయిరమాదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అధికారులు జడ్జికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో విజయరామారావు న్యాయమూర్తి దంపతులకు జ్ఞాపిక అందజేశారు.

మిస్ క్వీన్ ఆఫ్ ది వరల్డ్ రన్నరప్‌ను కలిసిన మంత్రి



నిషితతో మంత్రి ఐకేరెడ్డి, దివ్యారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో మిస్ క్వీన్ ఆఫ్ ది రన్నర్‌గా నిలిచిన జిల్లా కేంద్రానికి చెందిన నిషిత తిరునగరిని ఆదివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, మంజులాపూర్ మాజీ సర్పంచ్ నరేశ్, మంత్రి కోడలు అల్లోల దివ్యారెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామ ఉపసర్పంచ్ బొంపాల చిన్నయ్య, జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన నిజాముద్దీన్, గాజులపేట్‌కు చెందిన షెహబాజ్, మొయిన్‌తోపాటు పలువురు ముస్లిం యువకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని చెప్పారు. 2014, 2018 ఎన్నికల్లో కేసీఆర్ మైనార్టీలకు హామీలు ఇచ్చి గెలిచాక విస్మరించారని ఆరోపించారు. మైనార్టీలను గౌరవించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్, మైనార్టీ బంధు పేర్లతో మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకే గూటి పక్షులని, ఈ రెండు పార్టీలను భూస్థాపితం చేయాలని కోరారు.

'అందరి సహకారంతో ముందుకెళ్తా'



మోహన్‌రావుపటేల్‌తో రామారావుపటేల్

భైంసాటౌన్: అందరి సహకారంతో ఎన్నికల్లో ముందుకెళ్తానని ముధోల్ బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావుపటేల్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్ఎస్ కాటన్‌కు చేరుకుని మాట్లాడారు. తనకు పార్టీ టికెట్ కేటాయించినందుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాగా, రామారావుపటేల్‌కు టికెట్ ఖరారు కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ్‌రెడ్డి, రవిపాండే, నాయకుడు తూమోల్ల దత్తాత్రి తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



కండువా కప్పుతున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోన్ మండల కేంద్రానికి చెందిన 100 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు నితీశ్, పోశెట్టి, రాజారాం తదితరులున్నారు.

కమలదళం రెడీ

- ఏలేటి, రాథోడ్, పవార్‌లకు సీట్లు
- సర్వేలు, స్థానిక అంశాల ఆధారంగా..
- ఆశావహులకు టికెట్లిచ్చిన బీజేపీ
- ఆయా నేతలు, అనుచరుల హర్షం
- పోటీదారులను కలుస్తున్న నేతలు
- ప్రచారజోరు పెంచేలా ప్రణాళికలు



నిర్మల్: ఎట్టకేలకు ఎన్నికల సమరానికి కమలదళం రెడీ అయ్యింది. జిల్లా బరిలో నిలిచేదెవరో పార్టీ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. అభ్యర్థులుగా ఎవరుంటారో వారికి శనివారం సాయంత్రమే ఫోన్లు చేసి చెప్పింది. నిర్మల్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ నుంచి పవార్ రామారావుపటేల్, ఖానాపూర్ నుంచి రమేశ్ రాథోడ్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. ఇందులో మూడు వర్గాల నుంచి ఒక్కొక్కరికి టికెటిచ్చినట్లయ్యింది. మహేశ్వర్‌రెడ్డి ఓసీ (రెడ్డి) కాగా, రామారావుపటేల్ బీసీ (ఆరె మరాఠా), రమేశ్ రాథోడ్ ఎస్టీ (లంబాడా) సామాజికవర్గాలకు చెందినవారు. ఇక మహిళా కోటాలో తమకు సీటు దక్కుతుందని ఆశించిన జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు జానకీబాయి, సీనియర్ కోటాలో ఆశించిన ముధోల్ నేత భోస్లే మోహన్‌రావు పటేల్‌కు ఈసారి నిరాశే మిగిలింది. ఈక్రమంలో ఆదివారం తమ పేరు ప్రకటించగానే అభ్యర్థులు తమతోపాటు టికెట్ కోసం పోటీపడ్డ నాయకుల దగ్గరికి వెళ్లి సహకరించాలంటూ కోరుతున్నారు. పార్టీ కూడా ఈసారి ఎన్నికల్లో కలిసికట్టు పనిచేసి, గెలిచిన తర్వాత పదవులు పంచుకోవాలని సూచిస్తోంది.

నిర్మల్ నుంచి 'ఏలేటి' నాలుగోసారి..



నిర్మల్ నియోజకవర్గం నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేరు ప్రకటించగానే బీజేపీ శ్రేణులు, ఆయన అనుచరులు హర్షం వ్యక్తంజేశారు. ముందునుంచీ ఆయనకే టికెట్ వస్తుందన్న గ్యారంటీ ఉన్నప్పటికీ అధికారికంగా ప్రకటన రావడంపై వారు సంబురపడుతున్నారు. ఏలేటి సేవాకార్యక్రమాలతో రాజకీయాల్లోకి వచ్చి, 2009లో పీఆర్పీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఈఏడాది బీజేపీలో చేరి, ఇప్పుడు నాలుగోసారి ఎమ్మెల్యేగా బరిలో దిగుతున్నారు.

బయోడేటా..

పూర్తిపేరు: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

తల్లిదండ్రులు: లక్ష్మి, పద్మనాభరెడ్డి

భార్య: కవితారెడ్డి

పిల్లలు: కూతుళ్లు శన్విత, శృనిత, కుమారుడు శృంజిత్

కులం: ఓసీ, రెడ్డి

విద్యార్హత: ఎంబీఏ, వయస్సు: 55

స్వస్థలం: వడూర్, మం.నేరడిగొండ

స్థిరనివాసం: గాజుల్‌పేట్, నిర్మల్

రాజకీయ అనుభవం:

- సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన మహేశ్వర్‌రెడ్డి అనంతరం ఉద్యోగాన్ని వదిలి, విద్యాసంస్థలను నెలకొల్పారు.
- 2009 ఎన్నికల కంటే ముందు మహేశ్వర ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు చేరువయ్యారు.
- నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పాదయాత్ర చేపట్టారు.
- చిరంజీవి ప్రారంభించిన ప్రజారాజ్యం నుంచి 2009 ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌గా కొనసాగారు.
- 2023లో బీజేపీలో చేరారు.

ఖానాపూర్ టికెట్ రాథోడ్‌కే..



ఖానాపూర్ నియోజకవర్గంలో రాజకీయ అనుభవం, సీనియారిటీ ఉన్న రమేశ్ రాథోడ్ వైపు బీజేపీ మొగ్గు చూపింది. తెలుగుదేశం నుంచి ఎమ్మెల్యేగా, జెడ్పీచైర్మన్‌గా, ఎంపీగా చేసిన అనుభవం ఉన్నందున రాథోడ్‌కే కమలం టికెట్ కేటాయించింది. ప్రధానంగా ఆయన సీనియారిటీయే ఆయనకు కలిసివచ్చింది. ఇక్కడ ప్రధానంగా ఆయనకు పోటీగా పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు జానకీబాయి, హరినాయక్ తదితరులు టికెట్ ఆశించారు. ఇందులో జానకీబాయి రాష్ట్రస్థాయిలో తనకున్న పరిచయాలతో ప్రయత్నం చేసినా.. పార్టీ మాత్రం ఈసారి కొత్త అడుగు వేయకుండా, పాత సీనియర్ నేతకే మొగ్గు చూపింది.

బయోడేటా..

పూర్తిపేరు: రాథోడ్ రమేశ్

తల్లిదండ్రులు: కమలాబాయి, మోహన్ రాథోడ్

చిరునామా: సేవాదాస్‌నగర్, ఉట్నూర్, జి.ఆదిలాబాద్

వయస్సు: 57

కుటుంబం: భార్య సుమన్‌బాయి, మాజీ ఎమ్మెల్యే

బిడ్డ సోనీరాథోడ్, అల్లుడు రాంగోపాల్ (ఐపీఎస్),

కొడుకులు రితేశ్‌రాథోడ్ (బీజేపీ నేత), రాహుల్ రాథోడ్ (లక్షదీవుల కలెక్టర్)

కులం: ఎస్టీ, లంబాడా

రాజకీయం:

- 1995లో టీడీపీ నుంచి నార్నూర్ జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు.
- 1999 నుంచి 2004 వరకు ఖానాపూర్ ఎమ్మెల్యేగా పని చేశారు.
- 2006 నుంచి 2009 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్‌గా సేవలందించారు.
- 2009 నుంచి 2014 వరకు ఆదిలాబాద్ ఎంపీగా పని చేశారు.
- 2015 నుంచి 2016 వరకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగారు.
- 2021లో బీజేపీలో చేరారు.

ముధోల్‌లో పవార్‌వైపే పార్టీ మొగ్గు..



రాష్ట్రంలోనే బీజేపీకి క్లిష్టమైన, ముఖ్యమైన నియోజకవర్గంగా ముధోల్‌ను చెప్పవచ్చు. ఇక్కడి ఘటనల నేపథ్యంలో పార్టీ ముధోల్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. ఇక ఇక్కడ బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, రెండుసార్లు పోటీచేసి ఓడిన పడకంటి రమాదేవి, సీనియర్ నాయకులు పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్ టికెట్ కోసం సీరియస్‌గా పోటీపడ్డారు. ఎవరికి వారు ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. చివరకు పార్టీ మాత్రం డీసీసీ అధ్యక్షుడిగా ఉండి బీజేపీలో చేరిన రామారావుపటేల్ వైపే మొగ్గుచూపింది. ఆయననే అభ్యర్థిగా ప్రకటించడంతో అనుచరులు సంబురాలు జరిపారు. రామారావుపటేల్ తన పేరు ప్రకటించగానే వరుసకు సోదరుడు, బీజేపీ టికెట్ కోసం పోటీపడ్డ మోహన్‌రావు పటేల్‌ను కలవడం విశేషం. ఎన్నికల్లో తనకు సహకరించాలని ఆయనను కోరినట్లు తెలిసింది.

బయోడేటా..

పూర్తిపేరు: పవార్ రామారావుపటేల్

తల్లిదండ్రులు: రాధాబాయి, శ్యాంరావుపటేల్

వయస్సు: 65

కులం: బీసీ (ఆరె మరాఠా)

నివాసం: ఎస్ఎస్ కాటన్స్, బాసరరోడ్డు, భైంసా

విద్యార్హత: బీఎస్సీ (ఉస్మానియా యూనివర్సిటీ)

భార్య: దివంగత అనసూయాబాయి,

కొడుకులు: డాక్టర్ సతీశ్‌పవార్, సందీప్‌పవార్

రాజకీయం:

- వరుసకు సోదరుడైన మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ తెరవెనుక రామారావు పటేల్ కీలకంగా పనిచేశారు.
- సొంతంగా భార్య స్మారకార్థం అనసూయ పవార్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు.
- కాంగ్రెస్‌లో చేరి 2018 ఎన్నికల్లో ముధోల్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు.
- నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.
- డీసీసీ అధ్యక్ష హోదాలో 2022లో ప్రజాసంగ్రామయాత్ర ఐదోవిడత ప్రారంభసభలో బండి సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.

బీజేపీ అన్యాయం చేసింది

- జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తా
- ముధోల్ ఆశావహురాలు రమాదేవి
- 'పటేల్'కు టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం
- ముధోల్ బరిలో ఉంటానని వెల్లడి



భావోద్వేగంతో మాట్లాడుతున్న రమాదేవి

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి పదేళ్లుగా కృషి చేశానని, ఇప్పుడు తనను కాదని గత ఎన్నికల్లో మూడోస్థానంలో నిలిచిన మరో నాయకుడికి టికెట్ కేటాయించడమేంటని పార్టీ జిల్లా అధ్యక్షురాలు పీ రమాదేవి భావోద్వేగానికి లోనయ్యారు. బీజేపీ ముధోల్ అభ్యర్థిగా పవార్ రామారావుపటేల్‌ను పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం రాత్రి ఆమె భైంసాలోని తన నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. గత ఎన్నికల్లో రెండుసార్లు రెండోస్థానంలో నిలిచానని చెప్పారు. తనను కాదని ఆర్నెళ్ల కిందట పార్టీలో చేరినవారికి టికెట్ కేటాయించారని మండిపడ్డారు. ముధోల్ బరిలో ఉంటానని స్పష్టం చేశారు. పార్టీకి, జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని వెల్లడించారు. పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని ఆమె అభ్యర్థించారు. ఆమె వెంట పార్టీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, ఆయా మండలాల అధ్యక్షులు, తదితరులున్నారు.

అడెల్లి పోచమ్మా.. దీవించమ్మా..

- ఘనంగా ముగిసిన గంగనీళ్ల జాతర
- ఆలయానికి భారీగా వచ్చిన భక్తులు
- శోభాయాత్రగా తెచ్చిన ఆభరణాలు
- అడుగడుగునా అమ్మకు నీరాజనం
- దర్శించుకుని పులకించిన భక్తజనం



అమ్మవారి వస్త్రాలతో వెళ్తున్న భక్తులు



అమ్మవారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుంటున్న మంత్రి ఐకేరెడ్డి



అమ్మ దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



పూనకాలతో ఊగిపోతున్న శివసత్తులు



గంగనీళ్ల జాతరలో బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్/దిలావర్‌పూర్: భక్తులకు కొంగుబంగారంగా.. కోరిన కోర్కెలు తీర్చే అనురాగవల్లిగా.. జిల్లా ప్రజల ఇలవేల్పుగా పేరొందిన అడెల్లి మహాపోచమ్మతల్లి గంగనీళ్లజాతర ఆదివారం ఘనంగా ముగిసింది. అమ్మవారి ఆభరణాలు, గంగాజలంతో దిలావర్‌పూర్ మండలం సాంగ్వి నుంచి చేపట్టిన శోభాయాత్ర ఆదివారం అడెల్లి ఆలయానికి చేరింది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి నగలు అలంకరించారు. కుంకుమార్చన, పవిత్ర గంగానది జలాలతో ఆలయ శుద్ధి, అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం, అనంతరం పవిత్రోత్సవం తదితర పూజలు జరిపించారు. శనివారం రాత్రినుంచే ఆలయానికి భక్తులు రావడంతో పరిసరాలన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్రలోని యావత్‌మాల్, నాందేడ్, చంద్రాపూర్ జిల్లాల నుంచి, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాలనుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం ఉదయం కోనేరులో పవిత్ర స్నానాలాచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దిలావర్‌పూర్‌లో జరిగిన అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్నారు.

గంగాజలంతో ఆభరణాల శుద్ధి

దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామ గోదావరి పరీవాహక ప్రాంతం ఆదివారం తెల్లవారుజామున అశేష భక్తజనంతో పులకించింది. అడెల్లి మహాపోచమ్మ ఆభరణాల ఊరేగింపు శోభాయాత్ర శనివారం ఉదయం సారంగపూర్ మండలం అడెల్లి దేవస్థానం నుంచి మొదలై దిలావర్‌పూర్ మండలంలోని కదిలి, మాడేగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా రాత్రి సాంగ్వి పోచమ్మ ఆలయానికి చేరుకుంది. అమ్మవారి ఆభరణాల వెంట వచ్చిన భక్తులు రాత్రంతా అమ్మవారి నామస్మరణతో జాగరణలో పాల్గొన్నారు. ఆటపాటలతో అమ్మవారి ఆభరణాలను ఆదివారం తెల్లవారుజామున గోదావరి తీరానికి తీసుకువెళ్లారు. స్థానిక ఊరి పెద్దలు, అమ్మవారి ఆలయ పూజారులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారి నగలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరి జలాలను గడ ముంతల్లో తీసుకున్న భక్తులు గంగనీళ్ల జాతరకు అమ్మవారి ఆభరణాల వెంట వెళ్లారు.

కన్నుల పండువగా శోభాయాత్ర

సాంగ్వి ఆలయం నుంచి ఉదయం 6గంటలకు ప్రారంభమైన గంగనీళ్ల జాతర అడెల్లి దేవస్థానానికి తిరుగుపయనమైంది. ఈక్రమంలో కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం, కదిలి గ్రామాల్లో స్థానిక నాయకులు అమ్మవారి ఆభరణాల శోభాయాత్రకు మేళతాళాలు, భాజాభజంత్రీలతో ఘనస్వాగతం పలికారు. దిలావర్‌పూర్ గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు జాలుక దండ (భారీపూల తోరణం)తో స్వాగతం పలకగా.. గ్రామానికి చెందిన పోతరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించి జాతర ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు యాటపిల్లలను (గొర్రె పొట్టేళ్లు) బహూకరించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. దారి పొడవునా అమ్మవారి ఆభరణాలపై పసుపు నీళ్లు చల్లుతూ కొబ్బరి కాయలు కొడుతూ భక్తులు మొక్కు తీర్చుకున్నారు.


భక్తులకు ప్రత్యేక వసతులు

అడెల్లి ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో, దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. సారంగపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో వలంటీర్లు భక్తులకు సేవలందించారు.

భారీ పోలీస్ బందోబస్తు

అమ్మవారి ఆభరణాలతో శోభాయాత్ర నిర్వహించగా దారివెంట నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, సారంగపూర్ ఎస్సై కృష్ణసాగర్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. దిలావర్‌పూర్‌లోనూ నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ సీఐ శ్రీనివాస్, సోన్ సీఐ నవీన్‌కుమార్, దిలావర్‌పూర్ ఎస్సై యాసిర్ అరాఫత్, సోన్ ఎస్సై రవీందర్, రూరల్ ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

దుర్గామాతకు 108 రకాల నైవేద్యాలు



ఓం ఆకారంలో 108 రకాల నైవేద్యాలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోగల మస్కాపూర్–2 దుర్గామాత మండపంలో ఆదివారం భక్తులు అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ముందు ఓం ఆకారంలో నైవేద్యాలుంచి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

కొమురంభీమ్‌కు నివాళి



భీమ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ వద్ద ఆదివారం బీసీ హక్కుల పరిరక్షణ సమితి నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో కొమురం భీమ్ జయంతిని నిర్వహించారు. భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాసంఘాల నాయకులు భీమ్ సేవలు కొనియాడారు. బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి, తుడుందెబ్బ నాయకులు మొసలి చిన్నయ్య, మంద మల్లేశ్, సాకి లక్ష్మణ్, జాన్ సతయ్య, ఏఐవైఎస్ నాయకుడు వెంకట్‌స్వామి పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సిద్ధం



ఏర్పాట్లు చేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: దసరా ఉత్సవాలకు జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ ఆలయ ప్రాంగణం సిద్ధమైంది. సోమవారం సాయంత్రం 5గంటలకు వేడుకలు నిర్వహించేందుకు విశ్వహిందూ పరిషత్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రావణ దహనం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సకలం సిద్ధం చేశారు. ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. స్థానిక దేవరకోట దేవస్థానం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శమీపూజ, సాయంత్రం 5గంటలకు సహస్ర దీపోత్సవం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సోన్: దసరా సందర్భంగా షాపింగ్ చేసి తిరిగి వస్తుండగా యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సోన్ మండలం గల 44 జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సంతోషం రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని పాక్‌పట్లకు చెందిన నగేశ్ (22) బట్టలు కొనేందుకు ఆదివారం బైక్‌పై నిర్మల్ వెళ్లి తిరిగివస్తున్నాడు. ఆదిలాబాద్–హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటెయినర్ డ్రైవర్ వేగంగా వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టారు. నగేశ్ తలపై వెళ్లడంతో మృతిచెందాడు. తల్లి బోయవ్వ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాసరలో ఘనంగా నవరాత్రోత్సవాలు


నృత్యం చేస్తున్న కళాకారులు

భైంసా: బాసరలో నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఉత్సవాల్లో ఎనిమిదోరోజు సరస్వతీ అమ్మవారు మహాగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో వచ్చిన భక్తులంతా వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. నది ఒడ్డునున్న సూర్యేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో చిన్నారుల అక్షరాభ్యాస పూజలు కొనసాగుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బాసర ఎస్సై గణేశ్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రసాదాల కౌంటర్ వద్ద భక్తుల రద్దీ కనిపించింది. నాందేడ్‌కు చెందిన జగదీశ్‌మహరాజ్ గాడిపుర ఆధ్వర్యంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది.

ఆకట్టుకుంటున్న నృత్యాలు

దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసరలోని కోటి గాజుల మండపంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారంతా ఇక్కడ ప్రదర్శనలు ఇస్తున్నారు. సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఈ ప్రదర్శనలు ఇవ్వడం పూర్వజన్మ సుకృతమంటూ కళాకారులు చెబుతున్నారు. ప్రతీ రాత్రి ఈ మండపంలో భరత నాట్యం, కూచిపూడి, మరాఠీ భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అమ్మవారిని దర్శించుకున్న 'మైనంపల్లి'


పూజలు చేస్తున్న హన్మంత్‌రావు

బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు దర్శించుకున్నారు. బాసర మాజీ సర్పంచ్ మమ్మాయి రమేశ్, నాయకుడు సాంప్లీ రమేశ్ తదితరులు ఆయనను కలిశారు. ఆలయంలో మహాంకాళి ఆలయంలో పూజలు చేశారు.

ఎన్నికల 'ఉపాధి'

- ఎన్నికల వేళ పుంజుకోనున్న వ్యాపారాలు
- ఫ్లెక్సీలు మొదలు క్యాటరింగ్ సర్వీస్‌ల వరకు
- వంట మాస్టర్లు.. డ్రైవర్లకు చేతి నిండా పని
- పరికరాలను సిద్ధం చేసుకునే పనిలో వ్యాపారులు


సౌండ్ సిస్టం సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల నగారా మోగిందో లేదో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులే కాదు.. ఇటు బ్యానర్ల ప్రింటింగ్ మొదలు.. వాటిని కట్టే వారి నుంచి ప్రచార రథాలు నడిపే డ్రైవర్లు.. వంట మాస్టర్లు.. క్యాటరింగ్‌లు.. హోటళ్లు.. సప్లయర్స్.. ఇలా ప్రతి ఒక్క వ్యాపారం జోరందుకుంది. దాదాపు రెండు నెలల పాటు తమ వ్యాపారాలు ఎంచక్కా సాగుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండే ఆయా రంగాలకు చెందిన వ్యాపారులు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జోరుగా పోటీ జరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో వ్యాపారులు కూడా దానికి తగ్గట్టుగానే ముందుకు సాగుతున్నారు.

సప్లయర్స్ బిజీబిజీ..

సప్లయర్స్ వ్యాపారులకు ఇప్పటి నుంచే అడ్వాన్సులు అందుతున్నాయి. టెంట్లు, వంటపాత్రలు, లైటింగ్, కుర్చీలు, మైక్ సైట్లు, స్పీకర్‌లు ఎన్నికలకు ప్రధాన అవసరం కావడంతో చివరి దశలో వాటికి కొరత ఏర్పడే అవకాశం ఉండడంతో పార్టీల వారు ఇప్పటి నుంచే అడ్వాన్సులు ఇస్తున్నారు. దీంతో ఆ వ్యాపారులు కావాల్సిన సామగ్రిని ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకుంటున్నారు. మరికొందరు ప్రత్యేకంగా సౌండ్ సిస్టమ్‌కు సంబంధించిన షాపులను ఏర్పాటు చేసుకున్నారు.

ప్రధాన వ్యాపారాలివే...

ఫ్లెక్సీలు తయారు చేయడంలో ఫొటో డిజిటల్‌కు సంబంధించిన వారికి డిమాండ్ పెరిగింది. విభిన్న డిజైన్లను తయారుచేసే పనిలో డిజిటల్ వ్యాపారులు మునిగిపోయారు. ఇక ఫ్లెక్సీల ఏర్పాటుకు ముందుగానే కాంట్రాక్టు అప్పగించేస్తున్నారు. అలాగే క్యాటరింగ్ వారికి కూడా డిమాండ్ ఉంది. రోజు ఉదయం నుంచి రాత్రి వరకు కార్యకర్తలు, నాయకులు సమావేశాలకు వచ్చే వారికి టిఫిన్లు, భోజనం అందించేందుకు క్యాటరింగ్ ఇస్తున్నారు.

చేతి నిండా పని..

ప్రస్తుతం ఎన్నికల ప్రచారం కూడా చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించడంతోఇప్పటి నుండే పలువురికి చేతి నిండా పని దొరికింది. వాహనాలు ఉన్న వారు తమ వాహనాలను ఎన్నికలు ముగిసే వరకు అద్దెకు పెట్టేందుకు ఆయా పార్టీల వారితో చర్చలు చేస్తున్నారు. వీరితో పాటు వంట మాస్టర్లకు మంచి డిమాండ్ పెరిగింది. అభ్యర్థుల, పార్టీ క్యాంపు కార్యాలయాల వద్ద వంటలు చేసేందుకు మాస్టర్లను, వారికి సహాయకులను ప్యాకేజీ రూపంలో మాట్లాడుకుంటున్నారు. మొత్తంగా రూ.కోట్లల్లో వ్యాపారాలు జరిగే అవకాశాలున్నాయని పలువురు అంచనా వేస్తున్నారు.

అందుబాటులో వాహనం



గత ఎన్నికల్లో రాజకీయ పార్టీల సమావేశాల కోసం మొబైల్ అడ్వర్టైజ్ వాహనం నూతనంగా నిర్మల్‌కు తీసుకువచ్చాను. ఎన్నికల సందర్భంగా వాహనాన్ని సిద్ధం చేసి ఉంచాను. ఇప్పటికే ఆర్డర్లు కూడా వస్తున్నాయి.

– అయిట్ల ప్రవీణ్, రోషిని శ్రీ ఫొటో స్టూడియో

సౌండ్ సిస్టం ఏర్పాటు చేశాం



ఎన్నికల నేపథ్యంలో పెద్దపెద్ద సభల కోసం ప్రత్యేకంగా సౌండ్ సిస్టం ఏర్పాటు చేశాం. వివిధ రాజకీయా పార్టీల వారి నుంచి ఇప్పటికే ఆర్డర్లు మొదలవుతున్నాయి. మరో పది రోజుల్లో ఇంకా ఎక్కువగా ఆర్డర్లు వస్తాయని అనుకుంటున్నాను.

– వీరు, శివసాయి సౌండ్ సిస్టం నిర్వాహకుడు

ఫ్లెక్సీలకు గిరాకీ..



అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు భారీగానే ఏర్పాటు చేసేందుకు ఆర్డర్లు వస్తున్నాయి. రూ.17లక్షల విలువగల హైటెక్నికల్ మిషన్‌ను కొనుగోలు చేశాను. ఫ్లెక్సీలకు సంబంధించి ఆర్డర్లు వస్తున్నాయి.

– అదప శ్రీధర్, ఐ ఫ్లెక్సీ నిర్వాహకుడు

అడవిపందిని తప్పించబోయి..

- చెట్టును ఢీకొన్న ఆటో
- పలువురికి గాయాలు


చెట్టును ఢీకొట్టిన ఆటో

ఖానాపూర్: కడెం–ఖానాపూర్ రోడ్డుపై అడ్డుగా వచ్చిన అడవిపందిని తప్పించబోయి ఆటో చెట్టును ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. మండలంలోని సత్తన్‌పల్లి పొలిమేరలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన పలువురు ఖానాపూర్ నుంచి రెండు మేకలను కొనుగోలు చేసి ఆటోలో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో చెట్లపొదల నుంచి అడవి పంది అడ్డుగా రావడంతో ఆటో పక్కనే ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. ఆటోలో ఉన్న బొంగోని శేఖర్‌గౌడ్, బంగారు కొమురయ్య, గొల్ల సురేశ్, లింగాల రాజేందర్‌తోపాటు డ్రైవర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఘటన స్థలంలో చనిపోయిన అడవిపందిని గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి తీసుకెళ్లారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సమీపంలోని వాగులో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పొలానికి వెళ్లిన రైతులు మృతదేహాన్ని గమనించి గ్రామ కార్యదర్శి కళ్యాన్‌కర్ అశ్వినికి సమాచారం అందించారు. ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గత నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటారని, వయస్సు (45) ఏళ్లు ఉండవచ్చని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కన్న కూతురిపైనే కన్నేసిన తండ్రి

- భార్య ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): కన్న కూతురిపై కన్నేసిన ఓ తండ్రిపై ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పోక్సో కేసు నమోదైంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన పవర్ ఉత్తంసింగ్ ఈ నెల 21న రాత్రి మద్యం మత్తులో వివాహేతర సంబంధం ఉందంటూ తన భార్యతో గొడవకు దిగాడు. ఆమెపై దాడి చేయడంతోపాటు 16 ఏళ్ల తన కూతురుతో అసభ్యంగా ప్రవర్తించి ఇబ్బందికి గురిచేశాడని, ఆదివారం ఉదయం కూడా అలాగే ప్రవర్తించి చంపుతానని బెదిరించడంతో భార్య, కుటుంబ సభ్యులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉత్తంసింగ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

సిరికొండ: మండలకేంద్రంలోని బోయవాడ కాలనీలో మంచికంటి యశోద ఇంట్లో ఆదివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. వస్తువులు, ఫ్రిజ్, బీరువా, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. స్థానికులు విద్యుత్‌ను నిలిపివేసి మంటలార్పివేశారు.

నగదు పట్టివేత

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి సమీపంలో రూ.1.73 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. బులెరో వాహనంలో రవి భైంసా నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా తనిఖీ చేసి నగదును గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్‌చేసినట్లు ఎస్సై తెలిపారు.